క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



పీఆర్‌వో నాయుడికి చెక్కు అందజేస్తున్న దాత నాగేశ్వరరావు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం పీఎం పాలేనికి చెందిన బలిజి నాగేశ్వరరావు లక్ష రూపాయల విరాళం అందజేశారు. సింహగిరిపై విచారణ కార్యాలయంలో సంబంధిత చెక్కుని దేవస్థానం పీఆర్‌వో నాయుడికి అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ ఎడ్యుకేషన్‌పై సదస్సు ప్రారంభం

కొమ్మాది : విశాఖ జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న కెరీర్ ఎడ్యుకేషన్ అనే అంశంపై శిక్షణ తరగతులు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా గురువారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని గీతం ప్రో వీసీ వై.గౌతమ్‌రావు, డీఈవో చంద్రకళ ప్రారంభించారు. ఉపాధ్యాయులు, జూనియర్ లెక్చరర్లకు కెరీర్ ఎడ్యుకేషన్‌లోని పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తగరపువలస : చిట్టివలస రూరల్ విద్యుత్ సబ్‌స్టేషన్ 33/11 కేవీ తాళ్లవలస సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహణ పనులు, చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విశాఖ జోన్ – 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఈ అంతరాయం కారణంగా తాళ్లవలస లెజెండ్ లే అవుట్, తాళ్లవలస పంచాయతీలోని వలందపేట, మహిత లే అవుట్, హార్మోన్ లే అవుట్, ఎరుసుపేట, ఒనుముపేట, హాసిని లే అవుట్, రాయినపేట, తాళ్లవలస రాజులవీధి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

రైతుల సంక్షేమంపై దృష్టి



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం : దేశానికి వెన్నుముకలాంటి రైతుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలకు చెందిన రైతులకు రాయితీపై పలు రకాల విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఇబ్బందులు లేకుండా వ్యవసాయం చేసి పంటలు పండిస్తేనే అందరూ బాగుంటారన్నారు. ఆర్డీవో ఎస్.భాస్కర రెడ్డి, ఎంపీడీవో డాక్టర్ జానకి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

షిప్‌యార్డ్‌తో గీతం అవగాహన ఒప్పందం

కొమ్మాది : సాంకేతిక, మేనేజ్‌మెంట్ విభాగాల్లో పరస్పర సహకారానికి వీలుగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గీతం ప్రో వీసీ వై.గౌతమ్‌రావు సమక్షంలో హిందుస్థాన్ షిపియార్డ్ బిజినెస్ డెవలప్‌మెంట్, ఐటీ విభాగాల జనరల్ మేనేజర్ కమాండర్ జీపీ గుప్త అవగాహన ఒప్పందం మార్చుకున్నారు. ఈ సందర్భంగా కమాండర్ జీపీ గుప్త మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద నౌకా నిర్మాణ కేంద్రంగా హెచ్ఎస్ఎల్ గుర్తింపు పొందిందని, వాణిజ్య, రక్షణ అవసరాలకు తగిన 200 నౌకలను తాము ఇప్పటి వరకు నిర్మించామని తెలిపారు. అలాగే 2వేలకు పైగా నౌకలకు మరమ్మతులు నిర్వహించినట్లు తెలిపారు.

రోజంతా ఎడతెరిపి లేని వర్షం

చిరు వ్యాపారులు, కూలీలకు ఇబ్బందులు



కొమ్మాది జంక్షన్‌లో దట్టమైన మేఘం

మధురవాడ: మధురవాడలోని గురువారం రోజంతా ఎడతెరిపి లేని వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం, గురువారం రోజంతా కురిసిన వర్షంతో వాతావారణం పూర్తిగా చల్లబడింది. దీంతో మధురవాడ పరిసర ప్రాంతాల వాసులు ఆనందం వ్యక్తం చేశారు. దినసరి కూలీలు, చిల్లర వ్యాపారులు, వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చిన్నపాటి వర్షం కురిసినా చంద్రంపాలెం మెయిన్ రోడ్డులో రోడ్లు, కాలువలు ఏకమైపోవడంతో మురుగంతా రోడ్డుపై ప్రవహించింది. చంద్రంపాలెం హైస్కూలు గ్రౌండ్‌లో నీరు చేరడంతో విద్యార్థుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



వర్షంలోనూ ఆగని రాకపోకలు

రోడ్లపై నిలిచిన నీరు

పీఎం పాలెం : ఈ ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం నుంచి కురిసిన వర్షానికి రహదారులు చిత్తడిగా మారాయి. రోడ్లపై వర్షం నీరు నిలిచిపోవడంతో పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని రహదారులు వర్షం కారణంగా అధ్వానంగా మారాయి. ముస్లిం కాలనీ, ఆర్‌హెచ్ కాలనీ, గాయత్రినగర్‌లో తెరిపివ్వకుండా వర్షం కురవడంతో స్థానికులు ఇళ్లకే పరిమితమయ్యారు. ఈ ప్రాంతంలోని విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు ఇళ్లకు చేరుకునే క్రమంలో బస్టాపుల వద్ద తగినంతగా వసతి సదుపాయం లేకపోవడంతో తడిసిపోయారు.



పీఎం పాలెం ఆఖరు బస్టాపునకు వెళ్లే రోడ్డులో నిలిచిన వర్షం నీరు

ఉగ్గు తాగుతూ చిన్నారి మృతి



చిన్నారి వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు, కుటుంబీకులు



చిన్నారి దాన్విక

కొమ్మాది : ఉగ్గు తాగుతూ చిన్నారి మృతి చెందిన సంఘటన బీచ్ రోడ్డులో చోటు చేసుకుంది. జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేటకు చెందిన వాసుపల్లి వంశీ, ప్రవళికల ఏడాదిన్నర వయసు గల రెండో కుమార్తె దాన్విక (ధన) వారం రోజుల నుంచి దగ్గుతో బాధపడుతోంది. ఆ చిన్నారికి గురువారం ఉదయం ఉగ్గు పడుతుండగా ఒక్కసారిగా పాప చేతులు, కాళ్లు బిగించుకుని బిగ్గరగా అరిచింది. గమనించిన తల్లిదండ్రులు వెంటనే భీమిలిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అల్లారు ముద్దుగా చూసుకుంటున్న కుమార్తె హఠాత్తుగా చనిపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు అందరినీ కలచివేసింది.

మొక్కల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ

పద్మనాభం : మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని ఏక్సెనెయిడ్ సంస్థ హ్యూమన్ రైట్స్ డిపెండర్ ఐ.కృష్ణ కుమారి సూచించారు. పద్మనాభంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు వాతావరణంలో మార్పులు, ప్రభావంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కలుషితమవుతున్న పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా వుందన్నారు. ఇందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు తమ కేంద్రాల్లో మొక్కలు నాటాలన్నారు. సూపర్‌వైజర్ వి.ఉమా జానకి మాట్లాడుతూ మొక్కలు నాటి సంరక్షించినప్పుడే భవిష్యత్ తరాలు జీవించడానికి అవకాశం వుంటుందన్నారు.

పోస్టల్ సిబ్బందికి వీడ్కోలు



బదిలీ అయిన సిబ్బందికి వీడ్కోలు పలికి అభినందిస్తున్న ప్రస్తుత సిబ్బంది

భీమునిపట్నం: భీమిలి పోస్ట్ ఆఫీసులో సేవలు అందించిన నలుగురు సిబ్బంది బదిలీ కావడంతో గురువారం సాయంత్రం వారికి కార్యాలయం వద్ద ప్రస్తుతం ఉన్న సిబ్బంది వీడ్కోలు పలికారు. ఇక్కడ నాలుగు సంవత్సరాలుగా పని చేసి బదిలీ అయిన బ్రాంచి పోస్ట్‌మాస్టర్ ఆర్.ప్రసన్న శృతి, సబ్ పోస్టు మాస్టర్ ఎస్.ఆదినారాయణ, పోస్టల్ అసిస్టెంట్లు ఎస్.శంకరరావు, బి.ఆదినారాయణ తదితరులను ఘనంగా సత్కరించారు. వీరంతా ఎంతో బాధ్యతగా పనిచేసి అందరి మన్ననలు పొందారని, కొత్తగా పనిచేసే ప్రాంతాల్లోనూ మంచి సేవలు అందిస్తారని ఆకాంక్షించారు.

బీజేపీ నాయకుల పరామర్శ

తగరపువలస : అస్వస్థత కారణంగా ఇంటి వద్ద ఉన్న ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు మల్లారపు పైడిరాజును ఆ పార్టీ నాయకులు గురువారం పరామర్శించారు. ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు, పి.వి.వి.ప్రసాదరావు, మీసాల రాము, తదితరులు కలిశారు.

స్టాటస్టిక్స్ విభాగానికి పుస్తకాల బహూకరణ

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్టాటస్టిక్స్ విభాగానికి పుస్తకాలు, జర్నల్స్‌ను మాజీ ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు బహూకరించారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి సమక్షంలో గురువారం స్టాటస్టిక్స్ విభాగంలో ఈ కార్యక్రమం జరిగింది. గతంలో వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేసిన ఆచార్య కె.శ్రీనివాసరావు స్టాటస్టిక్స్ విభాగం ద్వారా వర్సిటీకి 40 ఏళ్ల సుదీర్ఘ సేవలు అందించారు. వివిధ హోదాల్లో వర్సిటీ ప్రగతికి కృషి చేశారు. తన పరిశోధనలకు సంబంధించిన పుస్తకాలు, జర్నల్స్ అల్బమ్స్‌తో పాటు ప్రముఖ వ్యాసాలతో కూడిన పుస్తకాలు విభాగ లైబ్రరీ ద్వారా విద్యార్థులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో బహూకరించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీఆర్ రాజు, స్టాటస్టిక్స్ విభాగాధిపతి ఆచార్య మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

తెగిన వలలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో తీవ్ర నష్టం

భీమునిపట్నం : సముద్ర జలాల్లో తెగిన వలలు, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల జీవాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని భారతీయ మత్స్య పరిశోధన సంస్థ విశాఖ శాఖ మెరైన్ ఇంజినీర్ డి.బామిరెడ్డి అన్నారు. బీచ్‌రోడ్డులోని చేపలుప్పాడ వద్దనున్న మత్స్యశాఖ అభివృద్ధి కార్యాలయంలో గురువారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది మత్స్యకారులు చేపల వేటకు వెళ్లే సమయాల్లో దెబ్బతిన్న వలలను సముద్రంలో వదలకూడదని, అలాగే తీరంలో ఉండే వారు ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్రంలోకి పడేయకూడదని సూచించారు. వీటి వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని, వీటిని నివారించాల్సిన బాధ్యత తీర ప్రాంతాల్లో ఉండే అందరిపైనా ఉందన్నారు. బీచ్‌లకు వచ్చే సందర్శకులు కూడా వినియోగించిన ప్లాస్టిక్ సీసాలు, కవర్లను తీరంలో పడేయకుండా చెత్త డబ్బాల్లో వేయాలని సూచించారు. అలాగే తాబేళ్లను వేటాడడం నేరమని, మత్స్యకారులంతా ఈ విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. స్థానిక మత్స్యశాఖ అధికారి డి.లావణ్య మాట్లాడుతూ సముద్రంలో మత్స్య సంపదను పెంచడం కోసం భీమిలి తీరంలో చేపలకు కృత్రిమ ఆవాస కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.



అవగాహన ర్యాలీలో మత్స్యకారులు

బురదమయంగా సిమెంట్ రోడ్డు

పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీ బర్లపేటలో సిమెంట్ రోడ్డు మధ్యలో శిథిలమైపోవడంతో బురదమయంగా తయారైంది. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు శిథిలమవడంతో మధ్యలో గొయ్యి ఏర్పడింది. వర్షం నీరు ఆ గొయ్యిలో చేరడంతో ఆ ప్రాంతమంతా బురదగా తయారైంది. ద్విచక్ర వాహనచోదకులు అందులో జారి పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గొయ్యిని పూడ్చి, బురద లేకండా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.



శిథిలమైన సిమెంట్ రోడ్డుపై బురద

జీవీఎంసీ తాగునీరు కలుషితం



జీవీఎంసీ పైప్‌లైన్ వద్ద మ్యాన్‌హోల్ లేని దృశ్యం



జీవీఎంసీ పైప్‌లైన్ నీరు ఇష్టానుసారంగా వాటర్ సర్వీసింగ్‌కు వినియోగిస్తున్న ప్రైవేటు వ్యక్తులు

మధురవాడ : కొందరు ప్రైవేటు వ్యక్తులు జీవీఎంసీ తాగునీటిని ఇష్టానుసారంగా వాడడమే కాకుండా కలుషితం చేస్తున్నా సంబంధిత అధికారులకు మాత్రం చీమ కుట్టినట్లు కూడా లేదు. జీవీఎంసీ 5వ వార్డు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పరదేశిపాలెం వద్ద జీవీఎంసీ మ్యాన్ హోల్ వద్ద తాగునీటిని కొందరు ఇష్టానుసారంగా వాటర్ సర్వీసింగ్‌కు వాడుతున్నారు. ఇక్కడ గ్యారేజీతోపాటు ఇతర వాహనాలను శుభ్రం చేయడానికి నీరు వాడుతున్నారు. మరోవైపు ఇక్కడ ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్‌కు కనీసం రక్షణ కూడా లేకపోవడంతో తాగునీరు కూడా కలుషితం అవుతోంది. కిలో మీటర్ల దూరం నుంచి అనేక వ్యయప్రయాసలకోర్చి తరలిస్తున్న తాగునీరు ఇలా వృథా, కలుషితం అయిపోతున్నా జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 06081001 1006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎ న0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసుల రెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

ఫ్లై ఓవర్ కిందే ప్రయాణికుల నిరీక్షణ

తగరపువలస : ఆనందపురం కూడలిలో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు ఫ్లై ఓవర్ల కింద ఎండ, వానల నుంచి తలదాచుకుంటున్నారు. విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాల వైపు ప్రయాణించే వాహనాలన్నీ ఈ ఫ్లై ఓవర్ కింద నుంచే రాకపోకలు సాగిస్తాయి. దీంతో ఈ కూడలిలో బస్ షెల్టర్లు లేకపోవడంతో వాహనాలు ప్రయాణించే రోడ్డు మీదే ప్రయాణికులు, విద్యార్థులు ఎదురు చూడాల్సి వస్తోంది. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని బిక్కుబిక్కుమంటూ వాహనాల కోసం ప్రయాణికులు ఎదురుచూస్తుంటారు. ఈ ప్రాంత ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని ప్రమాదాల నివారణతోపాటు ప్రయాణికుల శ్రేయస్సు కోసం బస్సు షెల్టర్లు నిర్మించాలని ఆనందపురం మండల ప్రజలు కోరుతున్నారు.



ఆనందపురం కూడలిలో ఫ్లై ఓవర్ కింద తలదాచుకున్న ప్రయాణికులు

మెడికల్ షాపులో రూ.45 వేలు చోరీ



చోరీ జరిగిన మెడికల్ షాపు వద్ద విచారిస్తున్న క్రైం ఎస్ఐ సూర్యప్రకాష్

తగరపువలస : స్థానిక భీమిలి రోడ్డులోని శ్రీప్రభ మెడికల్ షాపులో బుధవారం రాత్రి దొంగలు పడి రూ.45 వేలు అపహరించారు. బాధిత షాపు యజమానులు అలుగోలు కిషోర్, కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మందులకు సంబంధించిన బిల్లులు చెల్లించడానికి బుధవారం డబ్బులు సిద్ధం చేసి షాపులో ఉంచారు. వర్షం కారణంగా సంబంధిత వ్యక్తులు రాకపోవడంతో డబ్బులను షాపులోనే ఉంచి ఇంటికి వెళ్లిపోయారు. గురువారం ఉదయం వచ్చి షాపు తెరిచి చూసేసరికి... షాపుపైన సిమెంట్ రేకులకు కన్నంపెట్టి, మందులు చిందరవందరగా పడి ఉండడంతోపాటు క్యాష్ కౌంటర్‌లో డబ్బులు కనిపించలేదు. షాపు వెనుక నుంచి షెడ్డు మీదకు ప్రవేశించి సిమెంట్ రేకులకు కన్నం పెట్టడం ద్వారా లోపలకు దిగి చోరీ చేసినట్టు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు భీమిలి క్రైం ఎస్ఐ సూర్యప్రకాష్ షాపు వద్దకు చేరుకుని విచారణ ప్రారంభించారు. వ్యాపారులెవరూ షాపు మూసి వేసిన తర్వాత లోపల డబ్బులు ఉంచవద్దని తెలిపారు. రోజూ పని చేసే రెండు సీసీ కెమెరాలు కూడా ప్రస్తుతం పనిచేయనట్టు తెలుస్తోంది. గతంలో కూడా ఇదే మెడికల్ షాపులో దొంగతనం జరిగింది.

ఒకటి నుంచి సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు



గుజ్జు రామునాయుడు భవన్‌లో కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

తగరపువలస : జూలై ఒకటి నుంచి మూడు రోజులపాటు నగరంలోని మురళీనగర్‌లో నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ కార్యదర్శి కానూరి రాంబాబు కోరారు. ఈ సందర్భంగా గురువారం గుజ్జు రామునాయుడు భవన్‌లో సమావేశాలకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధాని మోడీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలతో కన్నూమిన్నూ కానకుండా వ్యవహరించిందన్నారు. ఫలితంగా గత ఎన్నికల్లో లభించిన 303 సీట్లు కన్నా 63 తగ్గిపోయాయన్నారు. మతతత్వ రాజకీయాలకు దేశంలో కాలం చెల్లిందన్నారు. కార్యక్రమంలో నాయకులు అల్లు బాబూరావు, కొండపు ఈశ్వరరావు, చిల్ల రాంపైడి, మోర అప్పలరాజు, మామిడి సన్నిబాబు, పల్ల లక్ష్మణరావు, ఎం.రామారావు పాల్గొన్నారు.

విద్యార్థులతో ఇంగ్లిష్‌లోనే మాట్లాడాలి



బంగ్లామెట్ట పాఠశాలలో మాట్లాడుతున్న త్రినాథరావు

తగరపువలస : విద్యార్థులతో ఉపాధ్యాయులు ఇంగ్లిష్‌లోనే మాట్లాడుతూ వారిని కూడా మాట్లాడేలా ప్రోత్సహించాలని భీమిలి డైట్ అధ్యాపకుడు సారిపల్లి త్రినాథరావు సూచించారు. గురువారం ఆయన జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యాశాఖ ఆదేశాల ప్రకారం ప్రస్తుతం పాఠశాలలో అమలవుతున్న విద్యా ప్రవేశిక, 'నేను బడికిపోతా' కార్యక్రమాలు ఎలా అమలవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. పాఠశాల కాలనిర్ణయ పట్టిక, ఉపాధ్యాయుల డైరీ, టీచింగ్ నోట్స్, సంసిద్ధత కార్యక్రమం, రికార్డులు, బోధనా విధానంపై పరిశీలించారు. బోధనాభ్యసన సామగ్రిని మరింత మెరుగుపరచుకోవాలని సూచించారు. విద్యాప్రమాణాలు తరగతుల వారీగా పరిశీలించి సూచనలు చేశారు. డిజిటల్ బోధన విధానాన్ని మెరుగుపరచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, పిన్నింటి నాగమణి, బుగత మల్లిక, తదితరులు పాల్గొన్నారు.

- బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఏఎన్ఎం హేమలత రక్తహీనత లోపాన్ని నివారించడానికి అవగాహన కల్పించారు. రక్తహీనతను నివారించేందుకు పండ్లు, డ్రై ఫ్రూట్స్ తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న కోడిగుడ్లు, రాగిజావ, వేరుశనగ చక్కీలు ఎంతో ప్రయోజనకరమన్నారు.

అప్పన్న స్వామికి ఘనంగా ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు



తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చనను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేసి 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- సింహాద్రి అప్పన్న స్వామికి గురువారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను బేడా మండపంలో వేదికపై అధిష్టింపజేసి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

6 నుంచి వారాహి అమ్మవారి నవరాత్రులు

తగరపువలస : జూలై 6 నుంచి 15 వరకు భీమిలి కీతినపేటలోని శ్రీవిద్యా శక్తిపీఠంలో వారాహి అమ్మవారి నవరాత్రులు నిర్వహించనున్నట్టు సోమయాజుల కల్యాణ చక్రవర్తి శర్మ తెలిపారు. రోజూ సాయంత్రం 6.30కి వారాహి దేవికి అర్చనలు నిర్వహిస్తామన్నారు. చివరి రోజైన 15న ఉదయం 9 గంటలకు వారాహి హోమం, పూర్ణాహుతి నిర్వహించనున్నామని తెలిపారు. వివరాలకు 89783 73743, 83283 05636లో సంప్రదించాలని కోరారు.

కళా విహీనం



మొక్కలు ఎండిపోవడంతో కళావిహీనంగా కనిపిస్తున్న కుండీలు

కొమ్మాది : గత ప్రభుత్వంలో బీచ్ రోడ్డు సుందరీకరణలో భాగంగా ప్రధాన కూడళ్లు, రహదారులు, కల్వర్టుల వద్ద ఆకర్షించేందుకు పలు ఆకృతులు, పెయింటింగ్స్, కుండీలలో మొక్కలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా కల్వర్టుల వద్ద దుర్వాసన రాకుండా, ఆకర్షించే విధంగా స్టాండ్‌లతో కుండీల్లో మొక్కలు ఏర్పాటు చేశారు. దీనిపై ప్రయాణికులు, పర్యాటకులు, సీనియర్ సిటిజన్స్ ఆనందం వ్యక్తం చేశారు. బీచ్‌రోడ్డు కొత్త శోభ సంతరించుకుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అయితే ప్రభుత్వం మారి నెల రోజులు కాకుండానే వీటి సంరక్షణకు చేతులెత్తేసింది. ఇక్కడ ఏర్పాటు చేసిన కుండీల్లో మొక్కలు వాడిపోగా, కొన్ని ఖాళీగా దర్శనమిస్తున్నాయి. జీవీఎంసీ అధికారులు వీటిని సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.